అన్నీ ఉన్నా... ఆకివీడు సీహెచ్‌సీకి తప్పని శని

- పోస్టులున్నా కొన్నింటికి డాక్టర్లు లేరు
- ప్రైవేటు ఆసుపత్రులకే క్యూ కడుతున్న రోగులు


ఆకివీడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

ఆకివీడు: అన్ని వసతులతూ 100 పడకల వైపుకు పరుగులు తీస్తున్న ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) రోగులకు మాత్రం దూరంగానే ఉందని చెప్పాలి. వసతులు పెరుగుతుంటే రోగుల సంఖ్య ఆ స్థాయిలో పెరగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిలో అన్ని వసతులూ సమకూర్చి, అదనపు భవన నిర్మాణం కూడా పూర్తి చేశారు. వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారు. ప్రతి రోజూ 150కి పైగా రోగులు వైద్యం పొందేవారు. కంటి విభాగానికి సంబంధించిన రోగులు అధిక శాతం ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందేవారు. ఉచితంగా కళ్లజోళ్లు పొంది ప్రపంచాన్ని చూసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఇక్కడలేదు. ఇటీవల కాలంలో ఆసుపత్రిలో దాతల సహకారంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. డయాలసిస్‌కు రోగులు వచ్చి వైద్యం పొందుతున్నారు. సీజనల్ జ్వరాలతో బాధపడే రోగులు ప్రైవేటు ఆసుపత్రుల్ని అధికంగా ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరిగింది.

వెంటాడుతున్న వైద్యుల కొరత

స్థానిక సీహెచ్‌సీలో అన్ని వసతులూ ఉన్నప్పటికీ వైద్యుల కొరత వెంటాడుతూనే ఉంది. ఆసుపత్రిలో 8 మంది డాక్టర్లుండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు డాక్టర్లు పనిచేస్తున్నారు. మరో ఇద్దరు స్థానిక వైద్యులు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. అత్యవసరమైన జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజిస్టు, పిరియాట్రిక్స్ వైద్యులు తాత్కలిక పద్ధతిపై పనిచేస్తున్నారు. డెంటల్ వైద్యుడు మూడు రోజులు స్థానికంగానూ, మూడు రోజులు రూరల్ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఎంబీబీఎస్ డాక్టర్లు ఇద్దరు, మత్తు డాక్టర్‌తో పాటు మూడు రోజులు డెంటల్ డాక్టర్ పని చేస్తున్నారు. పోస్టుమార్టం సెంటర్‌కు అనుమతి వచ్చినప్పటికీ, మృతదేహాల్ని భీమవరం తరలిస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో షెడ్డు నిర్మించాల్సి ఉంది. ఫ్రీజర్లు రెండు అవసరమవుతోంది. అవి లేకపోవడంతో పోస్టుమార్టం జరగడంలేదు.

కంటి, ఎముకల వైద్యుల్ని నియమించాలి

పెరుగుతున్న జనాభాకు అవసరమయ్యే విధంగా సీహెచ్‌సీలో వైద్యుల సంఖ్యను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు అత్యవసరమైన కంటి డాక్టర్, ఎముకల విభాగం డాక్టర్ పోస్టులు ఇక్కడ లేవు. దీంతో రోగులు అధిక సొమ్ము చెల్లించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో కంటి విభాగంకు సంబంధించి వైద్యం అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కంటి విభాగాన్ని తొలగించారు. దీంతో వృద్ధులు, కంటిలోపం ఉన్నవారు ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కళ్లజోళ్లను కూడా బయట కొనుగోలు చేయాల్సి వస్తుందని పేద వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాల్ని కూడా లయన్స్‌క్లబ్ వంటి సేవా సంస్థలు నిలిపివేశాయని పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ ఉన్నా పరికరాలు సున్నా

స్థానిక సీహెచ్‌సీలో పంటి డాక్టర్ అందుబాటులో ఉన్నా పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. డెంటల్‌కు సంబంధించి రెండు మూడు పరికరాలే ఉన్నాయి. ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో లేవు. రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూట్ కెనాల్, డెంటల్ ఎక్స్‌రే, ఇతర ఆధునాతన పరికరాలు లేక సరైన వైద్యం అందడంలేదని వాపోతున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



వైద్యులు, వైద్యపరికరాలు అందుబాటులో ఉండాలి. జనరల్ మెడిసిన వైద్యులు, ఎముకలు వైద్యుల్ని అందుబాటులో ఉంచాలి. కంటి వైద్యులు లేకపోవడం పేదలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ప్రసూతి, పిల్లల వైద్యుల్ని పూర్తి స్థాయిలో నియమించాలి. సుగర్, బీపీలకు సంబంధించి అన్ని రకాల మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి. పోస్టుమార్టంకు గది ఏర్పాటు చేయాలి.

–దోకల లక్ష్మి, సీపీఎం నాయకురాలు, ఆకివీడు

మెరుగైన వైద్య సేవల్ని అందించాలి



పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి. ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన వైద్య సేవలందించేందుకు నిపుణుల్ని ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల్ని తక్షణం భర్తీ చేయాలి. వైద్యులతోపాటు ఆధునిక పరికరాలు ఉంటే పేదలకు మరింత ఉత్తమ సేవలందుతాయి. కంటి విభాగం, ఎముకుల వైద్య పోస్టులు తీసుకువచ్చి, వైద్యుల్ని నియమించాలి.

వీ.జీ.కోటేశ్వరరావుబాబు, ఆకివీడు

స్పందనకు మూడు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు మూడు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉన్న మందుల షాపులు ఎవరి పేరున ఉన్నాయి, ఎన్ని ఆసుపత్రులకు డ్రగ్గు లైసెన్సులు ఇచ్చారు, మందుల షాపుల్లో పనిచేసేవారికి ఏ విధమైన క్వాలిఫికేషన్ ఉండాలో తెలియజేయాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. రేషన్ డీలర్లు మండలంలో ఎంత మంది ఉన్నారు, గతంలో రేషన్ పంపిణీకి చేసిన వ్యాన్లు ఎవరి పేరున ఉన్నాయి, అవి ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించవచ్చా వివరణ ఇవ్వాలని రామిరెడ్డి మరో ఫిర్యాదు చేశారన్నారు. స్థానిక గంగానమ్మకోడులో నివశిస్తున్న తనకు నివేశిన స్థలం ఇప్పించాలని నక్కా రాములు విజ్ఞపి చేశారన్నారు.

17న ఆకివీడు సీహెచ్‌సీలో ప్రత్యేక క్యాంపు

ఆకివీడు: ఈ నెల 17వ తేదీన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు వైద్యాధికారి సీహెచ్. ఆదిలక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు జేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ప్రత్యేక శిబిరాల్ని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించి, నిపుణులతో వైద్య సేవలందిస్తారని చెప్పారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఉప సభాపతి, జిల్లా వైద్యాధికారులు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

ఉండి: దేశాభివృద్ధిలో ఇంజనీర్ల కృషి కీలకమైనదని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు,పెన్మత్స రంగప్రసాదరాజు అన్నారు. సోమవారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ పులగం శ్రీనివాసరావు, హౌసింగ్ రిటైర్డ్ ఏఈ దాట్ల రామకృష్ణంరాజులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు రుద్రరాజు నరసరాజు, ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ ఏతరానికైనా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగిత మహంకాళి, కన్నెగంటి రూత్‌కళ, సత్తి బ్రహ్మారెడ్డి, బీ హరనాథరాజు, పెన్మత్స వెంకటజగన్నాధరాజు, గొట్టుముక్కల రాము, నంబూరి కాశీ, బుద్దరాజు సుబ్బరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, విద్యుత్, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉండిలో ఇంజనీర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మోక్షగుండ విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

వీరవాసరం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రపంచ ఖ్యాతి చెందిన ఇంజనీర్‌గా ఖ్యాతి గడించారని, ఆయన చేసిన సేవలు సాంకేతిక విజ్ఞానాన్ని నేటి యువ ఇంజనీర్లు నేర్చుకోవాలని వీరవాసరం కళాపరిషత్, కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. వీరవాసరం పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థి నేటి ఆర్ అండ్‌బి మండల ఇంజనీర్ ఎస్ఎస్ఎన్ మూర్తిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జయంతి రోజున నాకు జరిగిన సన్మానం జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి. లక్ష్మి కల్యాణి, భీమవరం కళాపరిషత్ అధ్యక్షుడు జవ్వాది దాశరధి శ్రీనివాస్, కెవిఎల్ ప్రసాదు, కుంచె వేణు, అన్నపూర్ణ, గుండా స్వాతి, పాలా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి ఆధునిక యుగంలో ఇంజనీర్ల పాత్ర ఎనలేనిది

భీమవరం: నేటి ఆధునిక యుగంలో కొత్త ఆవిష్కరణలు బయటకు వస్తున్నాయంటే దానికి ఇంజనీర్ల పాత్ర ఎనలేనిదని సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజనీర్స్ డి ఆనందరావు, ఎ సత్యనారాయణరావు అన్నారు. భీమవరం రైల్వే జంక్షన్‌లో సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే సందర్భంగా భీమవరం, నరసాపురం డివిజన్‌లోని ఆరుగురు రైల్వే ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు, కుక్కల బాల, జనపాటి మధుసూధన్ రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు,ఎస్ఎస్ఈ గిరిబాబు, సాయి, ఏడిఆర్ చౌదరి, ఎస్ సూర్యనారాయణరాజు, విజ్జురోతి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణం రాజు, టెక్నాలజీ సెంటర్‌హెడ్ ఎస్ గోపాలకృష్ణమూర్తిలు మాట్లాడుతూ దేశ పునఃనిర్మాణంలో ఇంజనీర్స్ ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. సమాజానికి ఉపయోగపడే అధునాతన నిర్మాణాలను వినూత్న పరిశోధనలతో తక్కువ సమయంలో వినియోగంలోకి వచ్చే విధంగా వంతెనలు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టినప్పుడే విశ్వేశ్వరయ్యకు ఇంజనీర్లు అందిస్తున్న ఘనమైన నివాళులన్నారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని జగపతిరాజు, మురళీకృష్ణంరాజు, గోపాలకృష్ణమూర్తిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ హెడ్ జి శ్రీబాల, డీన్ ఆర్అండ్‌డి వంశీ నాగరాజు, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరం: మూర్తిని సన్మానిస్తున్న దృశ్యం


భీమవరం: ఇంజనీర్స్‌డే సందర్భంగా రైల్వే ఇంజనీర్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం


ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ప్రభుత్వ నిర్ణయం అప్రజాస్వామికం

భీమవరం: విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని ఇది అప్రజాస్వామికమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం పట్టణంలోని మెంటేవారితోటలో బీసీ బాలుర కళాశాల వసతిగృహం సమీపంలో ప్రభుత్వ జీవో రద్దు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల వద్దకు వెళ్లి విద్యార్థుల సమస్యలపై దృష్టిపెట్టకుంటే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఏఐఎస్ఏ నాయకులు ఎస్ ప్రకాష్, జి ప్రేమ్, జి యశ్వంత్, జి హర్ష పాల్గొన్నారు.

సొమ్ము లెక్కలు చూపలేదని ఫిర్యాదు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని ఫిష్ ప్యాకింగ్, ఆక్వా ప్రాడక్టు పరికరాల విక్రయ దుకాణంలోని రూ.16.46 లక్షలకు లెక్కలు చూపలేదని దుకాణ యజమాని పి.దుశ్యంత్రెడ్డి ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. దుకాణంలో పనిచేసే వ్యక్తి తనకు చెప్పకుండా నగదును వేర్వేరు అవసరాలకు ఖర్చు చేసినట్లు పొంతనలేని సమాధానం చెబుతున్నాడని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై బి.వై కిరణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

జగన్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

కాళ్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, పార్టీ ప్రతిష్ట పెంచాలని ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహారాజు కోరారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమింపబడిన యర్లపాటి కిషోర్ ఉండి నియోజకవర్గ ఇంచార్జ్ పీవీఎల్ నరసింహారాజును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండేవారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎర్లపాటి కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సిద్ధాపురం గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహారాజు మర్యాదపూర్వకంగా కలిసిన కిషోర్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ డి రాంబాబు అన్నారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుకోని రీతిలో సైబర్ నేరానికి గురైతే కంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నెంబర్‌కు, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సీహెచ్ మహేష్ మాట్లాడుతూ ప్రజల బలహీనతలే సైబర్ నేరస్థుల బలంగా మారిందని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండటానికి అప్రమత్తతతే ప్రధాన ఆయుధమన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్‌సెల్ కానిస్టేబుల్ మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమవరం క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద ఈగల్‌సెల్ ఆధ్వర్యంలో ర్యాలీ దృశ్యం

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

ఆకివీడు: గాలిలో వ్యాప్తి చెందిన వైరస్ వల్ల పశువుల్లో గాలికుంటు వ్యాధి వస్తుందని మండల వ్యవసాయాధికారిణి భార్గవీ సత్య చెప్పారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ వారోత్సవాల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులుగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుందన్నారు. పశువుల్లో జ్వరం, సీరసం, నోటి నుంచి తీగల వలె చొంగ కారడం, కాలి గిట్టల మధ్య పండ్లు వంటివి ఏర్పడటం వంటి లక్షణాలతో పశువులు బాధపడుతుంటాయన్నారు. పశువుల్లో పై లక్షణాలతో పాటు పాల దిగుబడి తగ్గడం, మేత మేయకపోవడం లక్షణాలుంటాయన్నారు. పోతు పశువుల్లో పని సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. గుమ్ములూరు గ్రామంలో 120 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. వచ్చే నెల 15 వ తేదీ వరకూ టీకాలు గ్రామాల్లోనూ, పట్టణ కేంద్రంలోనూ పశువులకు వేస్తారని చెప్పారు.


గుమ్ములూరు గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యురాలు భార్గవీ సత్య

సంక్షిప్తంగా

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

పాలకోడేరు: మోగల్లు పంచాయతీలోని సర్వే నెంబర్ 594/3 లో గల చెరువు పోరంబోకును అదే గ్రామానికి చెందిన చిల్లే నరసింహులు ఆక్రమించుకుని, డ్రెయినేజీ పూడ్చి ఆర్‌సీసీ బిల్డింగ్ నిర్మించాడని చర్చి పరిసర ప్రాంత వాసులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఇంటిలోని వాడకం నీటిని పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలోకి వదులుతున్నారని దాని వల్ల పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. అంతే గాక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే పిల్లలు డ్రెయినేజీ పూడ్చడం వల్ల రోడ్ పై నిలిచిపోతున్న మురుగు నీటిలోంచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దర్యాప్తు చేసి ఆక్రమణలు తొలగించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో చిందాడ క్లైజ్జాన్, మల్లా సుబ్బారావు, కాటూరి ప్రభాకర్‌రావు, చిల్లా రత్నరాజు, వార్డు మెంబర్ భలే చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదు

ఉండి: భర్త ఆచూకీ తెలియజేయాలని భార్య పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండంలోని ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన 39 ఏళ్ల మూల శ్రీను అనే మతిస్థిమితం లేని వ్యక్తి గత నెల 30వ తేదీ ఉదయం 6 గంటల నుంచి కనిపించడం లేదు. ఇదే విధంగా గతంలోను రెండుసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొద్దిరోజుల తరువాత తిరిగి వచ్చేవాడు. అయితే ఈ సారి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాకపోవడంతో తెలిసినవారు బంధువుల వద్ద అతని ఆచూకీ కోసం ప్రయత్నించినా లాభం లేకపోవడంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

భీమవరం: తన భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని రాయలం గ్రామానికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై పి.రెహమాన్ సోమవారం తెలిపారు. చినఅమిరం గ్రామానికి చెందిన జి.నరేష్‌తో జ్యోతికి వివాహం జరిగింది. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేష్ మద్యానికి బానిసకావడమే గాక మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య జోతిని నిర్లక్ష్యం చేస్తూ శారీరకంగా, మానసికగా వేధిస్తున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

ఉండి: మండలంలోని మహదేవపట్నం, పాందువ్వ గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహదేవపట్నంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3800 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాందువ్వలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

క్లుప్తంగా

మోషేనురాజును కలిసిన చిట్టిబాబు


భీమవరంలో మోషేనురాజుకు పూలమొక్కను అందజేస్తున్న చిట్టిబాబు

భీమవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నూతనంగా నియమితుడైన మామిడిశెట్టి చిట్టిబాబు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం భీమవరంలోని మోషేనురాజు క్యాంపు కార్యాలయంలో చిట్టిబాబు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా వైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కాళ్ల: మండలంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా వైష్ణవ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజా కార్యక్రమం జరిపి అనంతరం 12 రకముల విశేష ప్రసాదములు స్వామివారికి నివేదించి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వివిధ గ్రామములో నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ ఏర్పాట్లు చేశారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

భీమవరం: పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇస్లామిక్ ట్రస్ట్ సేవాకార్యక్రమాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ సిద్దీఖ్ మాట్లాడుతూ అందరి దేవుడు ఒక్కడే, మానవులంతా ఒక్కటేనని సాటి మనుషుల పట్ల సత్ప్రవర్తన, అవసరార్థుల పట్ల జాలి, కరుణ, దయ, కుల మతాలకు అతీతంగా మానవసేవ ముహమ్మద్ ప్రధాన సందేశమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యండి మహబూబ్ పాషా, షేక్ ముజాహిద్, ముహమ్మద్ సిద్దీఖ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ఉండి: మండలంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో భీమవరానికి చెందిన మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి, ఇంపీరియల్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని రోగులకు ఉచితవైద్య సేవలు అందజేసారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందాల్సిన వైద్య సేవలు వైద్య శిబిరాల ద్వారా ఉచితంగా అందుతున్నాయని రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీవీఎల్ పరామర్శ


రత్నరాజు మాతృమూర్తి లిల్లీఫ్లొరెన్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీవీఎల్

ఉండి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టూరి రత్నరాజు మాతృమూర్తి లిల్లీఫ్లొరెన్స్ ఆదివారం మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు రత్నరాజు కుటుంబీకులను పరామర్శించారు. ఉదయం నిర్వహించిన అంత్యక్రియల్లో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ మాజీ రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్ పాల్గొని నివాళులర్పించారు. పార్టీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్రకార్యదర్శి కరిమెరక చంద్రరావు, జెడ్పీటీసీ రణస్తుల కనక దుర్గమహంకాళి, ఏడిద వెంకటేశ్వరరావు, గంద్రాజు రాజేష్‌వర్మ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు గలావిల్లి ధనుంజయ పాల్గొన్నారు.

రికవరీ కోసం తగు చర్యలు తీసుకోవాలి

పాలకోడేరు: మోగల్లు పంచాయతీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేసి ప్రజాధనాన్ని రికవరీ కోసం తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణీను అదే గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకటరాజు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మోగల్లు పంచాయతీ కార్యదర్శిగా కె వెంకటరాజు పంచాయతీ సొమ్ము రూ.14,92,707ను నిబంధనలకు విరుద్ధంగా తన సొంత ఖాతాలో వేసుకుని, స్వాహా చేశారని పేర్కొన్నారు. పై ఫిర్యాదులపై విచారణ జరిపి ప్రజాధనాన్ని రికవరీ చేయాల్సిందిగా కోరారు.